జర్నలిస్టు ముసుగులో వసూళ్లకు పాల్పడితే ఫిర్యాదు చేయండి : ఏసీపీ

కూకట్‌పల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల ముసుగులో అక్రమ వసూళ్లకు పాల్పడుతూ సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని వారిపై చట్టపరమైనచర్యలు తీసుకుంటామని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఏసీపీని కలిసిన కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్‌సభ్యులు జర్నలిస్టుల ముసుగులో వసూళ్లకు పాల్పడుతూ జర్నలిస్టు వృత్తికే కలంకం తీసుకువస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టులకు ప్రత్యేకస్థానం ఉందన్నారు. విలువలతో కూడిన జర్నలిజాన్ని పక్కన పెట్టి ధనార్జనే ధ్యేయంగా కొందరు బోరుబండ్ల వద్ద, గృహాల వద్ద డబ్బువసూళ్లకు పాల్పడుతూ వృత్తికే కలంకం తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టుసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్

ఎమ్మెల్యే సహకారంతోనే అభివృద్ధి పనులు

కూకట్‌పల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాదవరం కృష్ణరావు సహకారంతోనే మూసాపేటలో అభివృద్ధిపనులు కొనసాగుతున్నాయని మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్‌కుమార్ అన్నారు. శనివారం డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్‌తో కలిసి చైతన్య బస్తీలో పర్యటించారు. అక్కడ కొనసాగుతున్న పైప్‌లైన్ పనులను పరిశీలించారు. బస్తీవాసులు కలుషిత నీటితో ఇబ్బందులు పడుతుండటంతో సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోపాల్, తుకారం, బాబురావు, ఐలయ్య, శ్రీనివాస్, రాజు, కుమార్, నరేశ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో డ్రైవర్లతో ప్రమాణం చేయిస్తున్న ఎంవీఐ శ్రీనుబాబు

భద్రతా ప్రమాణాలు పాటించాలి : ఎంవీఐ

ఫతేనగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో శనివారం జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు ముఖ్య అతిథిగా హాజరై, భద్రతపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిపో డీఎం వి.హరి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ఎంఎఫ్ రాజేశ్వరి, డ్రైవర్లు, వెల్ఫేర్ మెంబర్లు పాల్గొన్నారు.



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

బాల్యం నుంచే పౌష్టికాహారం ఇవ్వాలి

బాలానగర్; జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే పిల్లలు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యం బాగుంటుందని హస్మత్‌పేట్ సెక్టార్ అంగన్‌వాడీ సెంటర్ల సూపర్ వైజర్ కెస్వరూప పిల్లల తల్లిదండ్రులకు, అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. శనివారం బాలానగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 5వ తరగతి పిల్లలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు ఉమ, జ్యోతి పాల్గొన్నారు.

వివిధ వేషధారణల్లో చిన్నారులు



స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణల్లో చిన్నారులు

కూకట్‌పల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పంచశీల పాఠశాలలో ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ తెలిపారు. పాఠశాలలో చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. దేశభక్తికి సంబంధించిన గీతాలను ఆలపించారు. 26 జనవరి గణతంత్ర దినోత్సవంపై విద్యార్థులకు శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి బ్యాచ్‌కు అడ్డాగా థీమ్‌పార్క్

ప్రారంభానికి ముందే కళావిహీనం



పచ్చదనంతో కనిపిస్తున్న థీమ్‌పార్కు

- పార్కులో పగిలిన కిటికీల అద్దాలు
- పాడైన పిల్లల ఆట వస్తువులు
- త్వరగా ప్రారంభించాలి : స్థానికులు

కళ్లుచెదిరే వాటర్ ఫౌంటెయిన్, ఎటుచూసినా పచ్చదనం, పిల్లల కోసం ఆటవస్తువులు, అద్భుతమైన యోగా కేంద్రం.. కూకట్‌పల్లి డివిజన్ ఆస్ బెస్టాస్, పాపిరెడ్డికాలనీ మధ్యలో నిర్మించిన థీమ్‌పార్క్‌లోని దృశ్యాలివి. సుమారు రెండు ఎకరాల స్థలంలో, రెండు కోట్ల రూపాయల నిధులతో నిర్మించిన థీమ్ పార్కు పనులు దాదాపు 90 శాతానికిపైగా పూర్తయ్యాయి. కానీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇంతలోనే అక్కడ పరిస్థితి మారిపోయింది. పిల్లల ఆట పరికరాలు విరిగిపోయాయి. ఎక్కడ చూసినా పగిలిన అద్దాలు, పాడైపోయిన కిటికీలు కనిపిస్తున్నాయి. ఇదంతా గంజాయి బ్యాచ్ పనేనని స్థానికులు ఆరోపిస్తున్నారు.



ధ్వంసమైన ఆట పరికరాలను చూపుతున్న స్థానికులు

కూకట్‌పల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆహ్లాదం కోసం కొత్తగా నిర్మించిన థీమ్ పార్కు ప్రారంభానికి ముందే కళ తప్పుతోంది. పార్కు ప్రహరీ దూకి లోపలకు ప్రవేశిస్తున్న కొందరు గంజాయి సేవిస్తూ పార్కులో ఉన్న గదుల కిటికీలు, పిల్లల ఆటవస్తువులు పాడు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఒక గదిలో ఎక్కడ చూసిన పగిలిన అద్దాలే దర్శనమిస్తున్నాయి. 90 శాతం పూర్తయిన పార్కులో వీధి దీపాలు లేకపోవడంతో ఆకతాయిలు అడ్డాగా మార్చుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితమే పార్కులో పనిచేస్తున్న వాచ్‌మన్‌పై గంజాయి బ్యాచ్ దాడి చేసుకుంది. ఒక గదిలో వేసి బయట గడియ బిగించారని వాచ్‌మన్ నర్సింహ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరగా ప్రారంభించాలి

ప్రజల ఆహ్లాదం కోసం నిర్మించిన పార్కును వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని 121 డివిజన్ బీజేపీ నాయకులు నరేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, గంగులరాజిరెడ్డి, మారెళ్ల శ్రీనివాస్, అక్కినపల్లి సాయి కుమార్‌లు కోరారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన పార్కు ప్రారంభానికి ముందే కిటికీలు, తలుపులు, అద్దాలు ధ్వంసం కావడంపై విచారం వ్యక్తం చేశారు.



విరిగిన తలుపులు

కంచె వేయాలి



గంజాయి బ్యాచ్‌తో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పార్కు గోడ ఎక్కకుండా పార్కు చుట్టూ ముళ్ల కంచె మాదిరిగా వైరు ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాలు బిగించాలి. వాచ్‌మన్‌లు ఉదయం మరియు సాయంత్రం రెండు షిఫ్టులు ఉండాలి.

\- గంగుల రాజిరెడ్డి, పాపిరెడ్డికాలనీ

పోలీసులకు ఫిర్యాదు చేశాం

థీమ్ పార్కు పనులు దాదాపు పూర్తైన్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. ఇక్కడ గంజాయి సేవించే వారి బెడద తీవ్రంగా ఉంది. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాం. ప్రహరీకి ముళ్ల కంచె ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

\- ప్రియాంక, జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్

క్లూ ఇవ్వకుండా.. కమిటీ కదిలేదెట్లా!

- జేఎన్‌టీయూ అక్రమాలపై ముందుకు సాగని విచారణ
- నేడో, రేపో వీసీతో భేటీ కానున్న కమిటీ



హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరీక్షల విభాగంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విచారణ మూడు అడుగులు ముందుకు, ఆరడుగులు వెనక్కు అన్నట్లుగా జరుగుతోంది. తొలుత విచారణ కమిటీకి చైర్మన్‌ను నియమించకుండా కేవలం సభ్యులను మాత్రమే నియమించిన ఉన్నతాధికారులు, తాజాగా విచారణను ముందుకు కొనసాగించేందుకు సహకరించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమిటీలో కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్లను ఒకరిద్దరిని చేర్చమని నియమించమని సభ్యులు కోరినా ససేమిరా కుదరదన్నట్లు సమాచారం. విచారణను మొదలెట్టేందుకు అవసరమైన క్లూ గానీ, ఫిర్యాదు పత్రాల కాపీలను ఇమ్మని కమిటీ అడిగినా సుముఖత వ్యక్తం చేయలేదని సమాచారం. విచారణ పేరుతో కేవలం కమిటీని వేసి చేతులు దులుపుకున్న ఉన్నతాధికారులు తమకు సహకరించకుంటే, విచారణను ఇకపై ముందుకు కొనసాగించలేమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై వర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌తో భేటీ అయ్యేందుకు అపాయింట్‌మెంట్ కోరగా, ఆయన రెండ్రోజులుగా అందుబాట్లో లేరనే జవాబు వచ్చినట్లు తెలిసింది. ఆది లేదా సోమవారాల్లో అయినా ఒకసారి వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీతో భేటీ కావాలని కమిటీ సభ్యులు భావిస్తున్నారు. పరీక్షల విభాగంలో విచారణ అంతా టెక్నికల్ అంశాలతో ముడిపడి ఉన్నందున కంప్యూటర్ సైన్స్ నిపుణులను ఇవ్వాలని, ఫిర్యాదుకు పత్రాల నకలు కాపీలను అందజేయాలని నేరుగా వీసీని డిమాండ్ చే సేందుకు సభ్యులు సన్నద్ధమయ్యారు. మరోవైపు కమిటీ విచారణ ముందుకు సాగకుండా అడ్డుపడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, ప్రొఫెసర్ల కమిటీతో కానప్పుడు పోలీసు ఎంక్వయిరీకి కేసును బదిలీ చేయాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఇన్‌చార్జ్ వీసీకి విజ్ఞప్తి చేస్తున్నారు.



కేపీహెచ్‌బీ వార్డు కార్యాలయం ముందు అధికారుల ఓటరు ప్రతిజ్ఞ

ఓటరు ప్రతిజ్ఞ

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని శనివారం కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఫ్యాకల్టీ, స్టూడెంట్స్ చేత ప్రిన్సిపాల్ వెంకటయ్య ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత, ఓటు ద్వారా ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విపులంగా వివరించారు. కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని శివశక్తి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వార్డు కార్యాలయం ప్రాంగణంలో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కట్టా నరసింగరావు, కొల్లా శంకర్, ఎస్కే సత్తార్, గౌతం కాంబ్లే, ప్రేమ్‌కుమార్, అంజి, నవీన్, రాజా వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటరు ప్రతిజ్ఞ



లివర్ స్క్రీనింగ్ క్యాంప్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ మేరకు వసంతనగర్‌లో రెనోవా హాస్పిటల్ సౌజన్యంతో మందలపు రోజారాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత లివర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉరుకులపరుగుల జీవితంలో ఎంత బరువు, బాధ్యతలు ఉన్నా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కనీసం డబ్బులు చెల్లించి చేయించుకోలేని వారు ఇలాంటి ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డా.ప్రసన్న గోరే రోగులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యర్రా నాగేశ్వరరావు, శ్యామలరాజు, కృష్ణారెడ్డి, నాగేశ్వరరావు, రత్నాకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వ్యక్తులపైకి దూసుకెళ్లిన కారు

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు.. నిర్లక్ష్యపు డ్రైవింగే కారణం



ప్రమాదానికి గురైన కారు

బంజారాహిల్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): యువకుల నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ఫుట్‌పాత్‌పైకి కారు దూసుకుపోవడంతో అక్కడ నిద్రిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. నిందితులు కారును అక్కడే వదిలేసి పారిపోయారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఈ దారుణం జరిగింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన నగల వ్యాపారి కుమారుడు హర్షవర్ధన్ షార్ట్ ఫిలింలు తీస్తూ హైదరాబాద్‌లో స్నేహితులతో కలిసి ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అతని స్నేహితుడు రాకేశ్ జూబ్లీహిల్స్‌లోని ఓ పబ్‌లో మద్యం తాగి తనను గదికి తీసుకెళ్లాలని హర్షవర్ధన్‌కు ఫోన్ చేశాడు. హర్షవర్ధన్ కూడా మద్యం తాగి ఉండటంతో తన కారును ఇతర స్నేహితులైన సాంకేత్ శ్రీనివాస్, వంశీకి ఇచ్చి పంపాడు. వారు జూబ్లీహిల్స్‌లో రాకేశ్‌ను ఎక్కించుకుని తిరిగి వెళుతుండగా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సమీపంలో కారు అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌పైకి దూసుకుపోయి.. రెయిలింగ్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. దాంతో అక్కడ నిద్రిస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కారు నడుపుతున్న శ్రీనివాస్, అతని పక్కనే ఉన్న వంశీ బయటకు వచ్చి పారిపోయారు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు : కాంగ్రెస్

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన పేదలు అందరికీ ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ యువ నాయకుడు గాదె శివచౌదరి అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని ఎవరైనా చెబితే నమ్మి డబ్బులు ఇవ్వొద్దన్నారు. లబ్ధిదారుల ఎంపిక ఎంతో పారదర్శకంగా జరుగుతుందని, స్థలం ఉన్న వారికి రూ.5లక్షలు ఆర్థికసహాయం అందజేస్తుందన్నారు. ఎవరైనా డబ్బులడిగినా, ఇళ్లు మంజూరు చేయిస్తామని చెబితే వారి మాటలు నమ్మకుండా తక్షణమే నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ దృష్టికి తీసుకోవాలని కోరారు.

నేడు కేన్సర్ ఉచిత స్క్రీనింగ్ క్యాంప్

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కూకట్‌పల్లి రాందేవ్‌రావు హాస్పిటల్‌లో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ సీఈవో డా.యోబు ఓ ప్రకటనలో తెలిపారు. కేన్సర్ పరీక్షలతో పాటు డాక్టర్ కన్సల్టేషన్, వ్యాధి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విపులంగా వివరిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు. వివరాలకు 040-29315002, 8886987866లో సంప్రదించాలని కోరారు.



సైనికులతో ఫొటోలు

సైనికులతో ఫొటో ఎగ్జిబిషన్

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీలోని లులు మాల్‌లో 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సైనికులతో ఫొటోలు తీసుకునేందుకు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఆయుధాలు, తుపాకులు, ఫిరంగుల పనితీరుపై విపులంగా వివరిస్తున్నారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఎగ్జిబిషన్ తెరిచి ఉంటుందని పేర్కొన్నారు.

పది ఫలితాలపై ప్రత్యేక దృష్టి

- జెడ్పీహెచ్ఎస్ బబ్బుగూడ స్కూల్‌లో విద్యార్థులు, అధ్యాపకుల కృషి
- ప్రత్యేక తరగతులతో ప్రైవేటుకు ధీటుగా బోధన
- వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పాఠాలు



ప్రత్యేక తరగతిలో విద్యార్థులకు బోధిస్తున్న మాస్టారు

అల్లాపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఈ సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధించాలన్న దృఢసంకల్పంతో బబ్బుగూడ జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఈ అంశమై ఉపాధ్యాయులు, విద్యార్థులు కూడా సమన్వయంతో ప్రయత్నిస్తున్నామని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బబ్బుగూడ ప్రధానోపాధ్యాయిని వకుళాదేవి పేర్కొన్నారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా టెన్త్ బోర్డు ఎగ్జాంలో ఫలితాలు రాబట్టేందుకు ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎస్ఎస్‌సి ఫైనల్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. చదువుల్లో కాస్త బలహీనంగా ఉన్న విద్యార్థులను గుర్తించి, వారి బలహీనతకు కారణాలను కనుగొని బోధనలో మార్పులు, తగిన విధంగా చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైనప్పుడు ప్రత్యేక తరగతుల ద్వారా వారి అనుమానాలను నివృత్తి చేస్తున్నారు. క్లిష్టమైన సబ్జెక్టులు మ్యాథ్యమేటిక్స్, ఫిజిక్స్‌తో పాటు ఇంగ్లిష్, మిగతా మూడు సబ్జెక్టులను కలుపుకుని మొత్తం ఆరు సబ్జెక్టులను వారంలోని ఆరు పనిదినాల్లో రోజుకొక సబ్జక్టు కవర్ చేస్తున్నారు. విద్యార్థులకు ఆయా సబ్జెక్టులో సందేహాలను నివృత్తి చేస్తూ విద్యార్థుల్లో భయాన్ని పోగొడుతున్నారు. తద్వారా విద్యార్థులు సునాయాసంగా పాసవ్వటమే కాకుండా మెరిట్ స్కోరు కొట్టేలా ఉపకరిస్తుందని ఉపాధ్యాయులు చెప్తున్నారు. మధ్యమధ్యలో టెస్టులు నిర్వహించి విద్యార్థుల్లో ఎగ్జామ్ పట్ల టెన్షన్‌ను దూరం చేయిస్తున్నారు. బబ్బుగూడలోని జెడ్పీహెచ్ఎస్‌లో 51 మంది విద్యార్థులు టెన్త్ బోర్డు ఎగ్జాంకు ప్రిపేర్ అవుతున్నారు. ఇందులో తెలుగు మీడియంలో 16 మంది, ఇంగ్లిష్ మీడియంలో 35 మంది విద్యను అభ్యసిస్తున్నారు.

నలుగురు, ఐదుగురు విద్యార్థులకో ఇన్‌చార్జి టీచర్



ప్రతి నలుగురు, ఐదుగురు విద్యార్థులకో ఇన్‌చార్జి టీచరును నియమించి వారిని పర్యవేక్షిస్తున్నాం. రోజూ వేకవనే 5 గంటలకు ఆయా ఇన్‌చార్జి టీచర్లు తమ టీంలోని విద్యార్థులకు వేక్-అప్ కాల్ చేసి చదువుకునేలా దోహదపడుతారు. రోజూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు ఎంత వరకు విద్యార్థులు అర్థం చేసుకుంటున్నారన్న విషయాన్ని స్వయంగా నేనే ఆరా తీస్తున్నాను. కొందరు విద్యార్థులను అక్కడక్కడా ఎంచుకుని సబ్జక్టును బట్టి ప్రశ్నలను అడిగి తగు సూచనలు చేస్తున్నా.

\- వకుళా దేవి, ప్రధానోపాధ్యాయిని, జెడ్పీహెచ్ఎస్ బబ్బుగూడ

భయాన్ని తొలగిస్తున్నాం



గణితం అంటే విద్యార్థుల్లో నెలకొన్న (ఫోబియా) భయాన్ని తొలగిస్తున్నాం. ప్రాబ్లం సాల్వ్ చేయడంలో వాళ్లను మమేకంచేసి మ్యాథ్స్ అంటే ఇష్టమైన సబ్జక్టుగా తీర్చిదిద్దుతున్నాం. గణితంలో వెనుకబడ్డ విద్యార్థులను గుర్తించి వారికి స్కోరింగ్ ప్రాబ్లమ్స్ షార్టుకట్స్, ఫార్ములాలను అధ్యయనం చేయిస్తున్నాం. ప్రతి విద్యార్థిపై ప్రత్యేకశ్రద్ధ పెట్టి వాళ్లు ఎక్కడ వీక్‌గా ఉంటే ఆయా అంశాలపై ఫోకస్ పెట్టి చెప్తున్నాం.

\- రవీంద్ర, మ్యాథమేటిక్స్ టీచర్

ప్రాక్టికల్స్‌తో సాధన



భౌతిక శాస్త్రాన్ని బాగా వివరించాలంటే ప్రాక్టికల్స్‌తో సాధ్యం. అందుకే ఏదైనా అంశం ల్యాబ్ ద్వారా వివరించి విద్యార్థులతోనే ప్రయోగం చేయించటంతో వారు బట్టీ పట్టే పని ఉండదు. నిజంగా ప్రాక్టికల్ చేశారు కనుక విషయం బాగా గుర్తుంటుంది. అంతే కాకుండా ఆయా అంశం మన నిత్య జీవితంలో ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకుంటారు.

\- ఎం.విజయలక్ష్మి, ఫిజిక్స్ టీచర్

పట్టిక ఆధారంగా ప్రశ్నలు



జీవశాస్త్రాని నిత్య జీవితంతో అనుసంధానించి బోధిస్తే విద్యార్థులు బాగా అర్థం చేసుకుంటారు. పట్టిక ఆధారంగా ప్రశ్నలను సమకూర్చి విద్యార్థులకు ప్రశ్న జవాబుల పోటీ పెడుతున్నాం. దాని వల్ల కాంపిటీటివ్ జీల్ రేకెత్తించడం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించవచ్చు.

\- స్వామి, బయో సైన్స్ టీచర్

● క్రీడాకారులకు అభినందనలు



కేపీహెచ్‌బీ రమ్యగ్రౌండ్‌లో జరుగుతున్న వాలీబాల్ తెలంగాణ సీఎం టోర్నమెంట్ పోటీలను శనివారం సాయంత్రం టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం తిలకించారు. పోటీల్లో విజేతలకు ట్రోఫీలను ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. - కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి)


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి, శేషగిరిరావు కుటుంబ సభ్యులు

కళలు మన సంస్కృతిలో భాగం : గవర్నర్

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కళలు మన సంస్కృతిలో భాగమని, మన ఘన సంస్కృతిని కాపాడుకునే బాధ్యత యువతపై ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శనివారం "రివైవింగ్ ద రూట్స్" పేరుతో డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు కుంచె నుంచి జాలువారిన చిత్రాల ప్రదర్శనను ప్రారంభించారు. శేషగిరిరావు చిత్రించిన అరుదైన పెయింటింగ్‌లను భద్రపరిచి ప్రదర్శనకు పెట్టిన ఆయన కుటుంబ సభ్యుల ను గవర్నర్ అభినందించారు. తమ కుటుంబంలోనూ కళాకారులు ఉన్నారని, తన మామయ్య సైతం చిత్రకారుడేనని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్టేట్ ఆర్ట్ గ్యాలరీ ఆధ్వర్యంలో నిర్వహించే "ఆలిండియా ఆర్ట్ కాంపిటీషన్" పోస్టర్‌ను గవర్నర్ విడుదల చేశారు. స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ.. ఆలిండియా ఆర్ట్ కాంపిటీషన్ 6వ ఎడిషన్‌లో విజేతకు రూ.లక్ష, రెండవ విజేతకు రూ.50 వేలు, మూడవ విజేతకు రూ.20 వేలతో పాటు జ్ఞాపికలను అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఫిబ్రవరి 22 నుంచి మార్చి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వ్యక్తులపైకి

దూసుకెళ్లిన కారు

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు.. నిర్లక్ష్యపు డ్రైవింగే కారణం

బంజారాహిల్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): యువకుల నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ఫుట్‌పాత్‌పైకి కారు దూసుకుపోవడంతో అక్కడ నిద్రిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. నిందితులు కారును అక్కడే వదిలేసి పారిపోయారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఈ దారుణం జరిగింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన నగల వ్యాపారి కుమారుడు హర్షవర్ధన్ షార్ట్ ఫిలింలు తీస్తూ హైదరాబాద్‌లో స్నేహితులతో కలిసి ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అతని స్నేహితుడు రాకేశ్ జూబ్లీహిల్స్‌లోని ఓ పబ్‌లో మద్యం తాగి తనను గదికి తీసుకెళ్లాలని హర్షవర్ధన్‌కు ఫోన్ చేశాడు. హర్షవర్ధన్ కూడా మద్యం తాగి ఉండటంతో తన కారును ఇతర స్నేహితులైన సాంకేత్ శ్రీనివాస్, వంశీకి ఇచ్చి పంపాడు. వారు జూబ్లీహిల్స్‌లో రాకేశ్‌ను ఎక్కించుకుని తిరిగి వెళుతుండగా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సమీపంలో కారు అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌పైకి దూసుకుపోయి.. రెయిలింగ్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. దాంతో అక్కడ నిద్రిస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కారు నడుపుతున్న శ్రీనివాస్, అతని పక్కనే ఉన్న వంశీ బయటకు వచ్చి పారిపోయారు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.


అధ్వానంగా నీటికొలను

పెద్దచెరువు నీటికొలనును శుభ్రం చేయాలి

గచ్చిబౌలి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల పెద్దచెరువులో జీహెచ్ఎంసీ నిర్మించిన నీటికొలను దుర్గంధంగా మారింది. గణేశ్ నవరాత్రి, బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా స్థానికులు గణపతి విగ్రహాలు, బతుకమ్మలను ఇక్కడ నిమజ్జనం చేశారు. దీంతో అధికారులు కొలనును శుభ్రం చేయక పోవడంతో దుర్వాసన వస్తోందని, పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు వృద్ధి చెందుతున్నాయని, ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొలనును శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.

స్వచ్ఛతకు మారుపేరుగా శేరిలింగంపల్లి సర్కిల్

గచ్చిబౌలి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ స్వచ్ఛతకు మారుపేరుగా తీర్చిదిద్దాల్సిన అవసరం తమపై ఉందని శేరిలింగంపల్లి సర్కిల్ ప్రజారోగ్య అధికారి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తమసిబ్బందికి పిలుపునిచ్చారు. శనివారం తన చాంబర్‌లో శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని ఎస్ఆర్‌పీలు, ఎస్ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. మీ పరిధిలోని ప్రతి కాలనీలో నిత్యం తిరుగుతూ చెత్తాచెదారం లేకుండా చూడాల్సిన బాధ్యత మీదని, కాలనీల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, ఫిర్యాదులు రాకుండా చేసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. రిక్షా ఆటోలు ప్రతి ఇంటికీ వెళ్లి చెత్త సేకరించేలా చూడాలన్నారు. కాలనీల్లో చెత్తకుప్పలు లేకుండా ఆరుబయట వేయకుండా చూడాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీలు, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

'ఏకగ్రీవ నిర్ణయాలను వక్రీకరించడం తగదు'

ఖేల్‌కాలనీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎంఐజీ కాలనీ సొసైటీ సర్వసభ్య సమావేశాల్లో ఏకగ్రీవంగా ఆమోదించి, తీసుకున్న నిర్ణయాలను వక్రీకరిస్తూ అభివృద్ధి పనులు జరగకుండా అడ్డుకుంటున్న వారిపై సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సొసైటీ మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి సూచించారు. కాలనీలో గల సొసైటీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సమస్యలు, కోర్టు వాజ్యాలు, సొసైటీ కార్మికులు పడుతున్న ఇబ్బందులు వాటి పరిష్కారంపై సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సొసైటీలో దశాబ్దాలుగా పనిచేసి కాలనీ అభివృద్ధికి సహకారం అందించిన సొసైటీ కార్మికులకు సర్వసభ్య సమావేశంలో తీర్మానించి కేటాయించిన స్థలాలపై వివాదం చేయడం సోచనీయమన్నారు. కాగా గతంలో జరిగిన పలు పనులు కేటాయింపులపై మాజీ సభ్యులపై తప్పుడు కేసులు వేసి, కోర్టుల చుట్టూ తిప్పించడం సిగ్గుచేటన్నారు. సమస్యల పరిష్కారం కోసం సభ్యులు సహకారమందించాలని కోరారు. సమావేశంలో ఖేల్ కార్మిక సంఘాల నాయకులు బాగ్యారావు, జామవా, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి బ్యాచ్‌కు అడ్డాగా

థీమ్ పార్క్

ప్రారంభానికి ముందే కళావిహీనం


పచ్చదనంలో కనిపిస్తున్న థీమ్‌పార్కు.

- పార్కులో పగిలిన కిటికీల అద్దాలు
- పాడైన పిల్లల ఆట వస్తువులు
- త్వరగా ప్రారంభించాలి : స్థానికులు

కళ్లుచెదిరే వాటర్ ఫౌంటెయిన్, ఎటుచూసినా పచ్చదనం, పిల్లల కోసం ఆటవస్తువులు, అద్భుతమైన యోగా కేంద్రం.. కూకట్‌పల్లి డివిజన్ ఆస్ బెస్టాస్, పాపిరెడ్డికాలనీ మధ్యలో నిర్మించిన థీమ్‌పార్క్‌లోని దృశ్యాలివి. సుమారు రెండు ఎకరాల స్థలంలో, రెండు కోట్ల రూపాయల నిధులతో నిర్మించిన థీమ్ పార్కు పనులు దాదాపు 90 శాతానికిపైగా పూర్తయ్యాయి. కానీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇంతలోనే అక్కడ పరిస్థితి మారిపోయింది. పిల్లల ఆట పరికరాలు విరిగిపోయాయి. ఎక్కడ చూసినా పగిలిన అద్దాలు, పాడైపోయిన కిటికీలు కనిపిస్తున్నాయి. ఇదంతా గంజాయి బ్యాచ్ పనేనని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కూకట్‌పల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆహ్లాదం కోసం కొత్తగా నిర్మించిన థీమ్ పార్కు ప్రారంభానికి ముందే కళ తప్పుతోంది. పార్కు ప్రహరీ దూకి లోపలకు ప్రవేశిస్తున్న కొందరు గంజాయి సేవిస్తూ పార్కులో ఉన్న గదుల కిటికీలు, పిల్లల ఆటవస్తువులు పాడు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఒక గదిలో ఎక్కడ చూసిన పగిలిన అద్దాలే దర్శనమిస్తున్నాయి. 90 శాతం పూర్తయిన పార్కులో వీధి దీపాలు లేకపోవడంతో ఆకతాయిలు అడ్డాగా మార్చుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితమే పార్కులో పనిచేస్తున్న వాచ్‌మన్‌పై గంజాయి బ్యాచ్ చేసుకుంది. ఒక గదిలో వేసి బయట గడియ బిగించారని వాచ్‌మన్ నర్సింహ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ధ్వంసమైన ఆట పరికరాలను చూపుతున్న స్థానికులు

త్వరగా ప్రారంభించాలి

ప్రజల ఆహ్లాదం కోసం నిర్మించిన పార్కును వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని 121 డివిజన్ బీజేపీ నాయకులు నరేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, గంగులరాజిరెడ్డి, మారెళ్ల శ్రీనివాస్, అక్కినపల్లి సాయి కుమార్‌లు కోరారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన పార్కు ప్రారంభానికి ముందే కిటికీలు, తలుపులు, అద్దాలు ధ్వంసం కావడంపై విచారం వ్యక్తం చేశారు.



విరిగిన తలుపులు

కంచె వేయాలి



గంజాయి బ్యాచ్‌తో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పార్కు గోడ ఎక్కకుండా పార్కు చుట్టూ ముళ్ల కంచె మాదిరిగా వైరు ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాలు బిగించాలి. వాచ్‌మన్‌లు ఉదయం మరియు సాయంత్రం రెండు షిఫ్టులు ఉండాలి.

- గంగుల రాజిరెడ్డి, పాపిరెడ్డికాలనీ

పోలీసులకు ఫిర్యాదు చేశాం

థీమ్ పార్కు పనులు దాదాపు పూర్తైన్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. ఇక్కడ గంజాయి సేవించే వారి బెడద తీవ్రంగా ఉంది. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాం. ప్రహరీకి ముళ్ల కంచె ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

- ప్రియాంక, జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్

హృదయాన్ని తాకే సంగీతం

నగరంలో సందడి చేసిన అమిత్ త్రివేది, నిఖిత గాంధీ, రఫ్తార్

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బౌల్డర్‌హిల్స్‌లో మూడో ఎడిషన్‌ను రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ ప్రారంభించింది. ఈ ఏడాది ప్రత్యేకంగా మ్యూజిక్, గేమింగ్ వినోదాన్ని ఒకచోటకు తీసుకువచ్చారు. మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో మ్యూజిక్ డైరెక్టర్ అమిత్ త్రివేది మాట్లాడుతూ రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ మ్యూజిక్ హృదయాన్ని నేరుగా తాకుతుందన్నారు. హైదరాబాద్‌లో ప్రదర్శన చేయడం ఎంతో ఉత్సాహవంతమైన అనుభవాన్ని కలిగిస్తుందన్నారు. గాయని నిఖితగాంధీ మాట్లాడుతూ మ్యూజిక్‌తో హద్దుల్ని అధిగమించవచ్చన్నారు. ప్రముఖ హిప్-హప్ కళాకారుడు రఫ్తార్ మాట్లాడుతూ ప్రభావం చూపించే బీట్స్ ఉద్వేగాలు ఎల్లప్పుడూ జీవితంలో కీలక అంశంగా ఉంటాయన్నారు. డీజే యోగి మాట్లాడుతూ విభిన్నమ్యూజిక్ అనుభూతితో అందరిలో కొత్త ఉత్సాహం నింపడమే లక్ష్యమన్నారు. గేమింగ్ ఇన్‌ఫ్లూయెనర్సన్ మున్నాబాయ్ మాట్లాడుతూ రాయల్ స్టాగ్ బూట్ బాక్స్ మ్యూజిక్‌తో గేమింగ్‌ను కలపడం గొప్పగా నిలుస్తుందన్నారు.


మూడో ఎడిషన్ రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ ప్రారంభంలో సందడి చేస్తున్న అమిత్ త్రివేది, నిఖిత గాంధీ, రఫ్తార్‌లు


నగర సంకీర్తన చేస్తున్న విద్యార్థులు, కళాకారులు

ముగిసిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ఖేల్‌కాలనీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎంఐజీ కాలనీలో శ్రీ రామాలయంలో వారంరోజులుగా జరుగుతున్న శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు శనివారం జరిగిన నగర సంకీర్తన, గోష్ఠిగానంతో ముగిసాయి. కళ్యాణి సంగీత విద్యాలయం నిర్వాహకురాలు సాయి శిరీష ఓరుగంటి శిష్య బృందంతో ఈ నెల 18 నుంచి 24 వరకు ప్రతీ రోజు సాయంత్రం శ్రీ రామాలయంలో వాగ్గేయకారుల వారోత్సవాలు జరిగాయి. కాగా శనివారం ముగింపు సందర్భంగా కాలనీలో గల ప్రధాన రహదారులపై సంగీత కళాకారులు, విద్యార్థులతో నగర సంకీర్తన మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ రామాలయం వరకు జరిగాయి. అనంతరం కల్యాణ మండపంలో చిన్నారులతో ఉత్సవ సంప్రదాయ కీర్తనలు, కృతులు, బృందగానం నిర్వహించగా, భక్తులు రామనామస్మరణలు చేశారు. అనంతరం పంచరత్న కృతులతో గోష్ఠిగానం నిర్వహించడంతో ఆరాధనోత్సవాలు ముగిసాయి. దేవాలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి నిత్యావసరాలు పంపిణీ

మియాపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ విడియా కాలనీలోని వివేకానంద సేవా సంఘం ఆశ్రమానికి సైబేజ్ సాఫ్ట్‌వేర్ సంస్థ నెలకు కావాల్సిన నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా సైబెజ్ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అనపురపు సురేష్ మాట్లాడుతూ తమ సంస్థ అనాథ ఆశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు చేయూత ఇవ్వడంలో ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. అనంతరం పిల్లలకు డ్రాయింగ్ కాంపిటీషన్, మ్యూజికల్ చైర్ ఆటలు ఆడిపించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు సుందర్‌ప్రసాద్, కంపెనీ ఉద్యోగులు సురేష్, కిరణ్‌కుమార్, గోపీకృష్ణ, వెంకటేష్, కార్తీక్, సంజయ్, పవికుమార్, వినయ, కిరణ్మయి, శిల్ప, మానస, సుమన్, సాయిచందు, చైతన్య, హరీష్, సంతోష్, తిరుపతి, సాయిప్రసాద, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.


చిన్నారులతో ఆడుతున్న కంపెనీ ప్రతినిధులు

ఆకట్టుకున్న మ్యూజిక్ ఫెస్ట్


పాటలు పాడుతున్న గాయకులు, కేరింతలు కొడుతున్న యువత

రాయదుర్గం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని బౌల్డర్‌హిల్స్‌లో శనివారం రాత్రి జరిగిన మ్యూజిక్ ఫెస్ట్ యువతను ఉర్రూతలూగించింది. రాయల్‌స్టాగ్ బూమ్‌బాక్స్ 3వ ఎడిషన్‌ను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ వేడుకల్లో అమిత్ త్రివేది, మున్నాభాయ్ గేమింగ్, జోహరికి హవేలిలా, హిప్‌హప్ కళాకారుడు రఫ్తార్, డీజే యోగి పాల్గొన్నారు.



వైభవంగా ఏకాదశి పూజలు


సుగంధాలంకరణతో దర్శనమిచ్చిన లక్ష్మీనరసింహుడు

ఖేల్‌కాలనీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో గల దేవాలయాల్లో ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. శ్రీ అభిషేక లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం బహుళ ఏకాదశి సందర్భంగా నిత్యపూజలతో పాటు విశేష అభిషేకాలు, అర్చనలను దేవాలయ ప్రధాన అర్చకుడు భార్గవ్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. లక్ష్మీనరసింహ స్వామిమూల విగ్రహాలకు విశేష ఫల పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలు, పుష్పాలతో అర్చన జరిగాయి. పుష్యమాసంలో వచ్చే పవిత్ర దినాల్లో ఒకటైన ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వేంకటేశ్వర, యోగీశ్వర స్వామిదేవాలయం, శ్రీ మురళీకృష్ణ స్వామి ఆలయం, ఎంఐజీకాలనీలో గల శ్రీరామాలయంలో విశేష పూజలు జరగ్గా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంభీర్‌చెరువు సుందరీకరణ పనుల పరిశీలన

హైదర్‌నగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ ప్రగతినగర్ అంభీర్‌చెరువు సుందరీకరణ పనులను పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ అంభీర్‌చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని, చెరువు చుట్టుపక్కల ప్రజల విజ్ఞప్తి మేరకు గుర్రపు డెక్క తొలగిస్తున్నామన్నారు. దీంతో పరిసర కాలనీవాసులకు దోమల బెడద తగ్గుతుందన్నారు. మురుగునీరు చెరువులో కలవకుండా ప్రత్యేకంగా చెరువుచుట్టూ నిర్మించే మురుగు నీటి కాల్వ, అలుగు మరమ్మతులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడతామని గాంధీ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, స్థానికులు పాల్గొన్నారు.


చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి: ప్రిన్సిపాల్

చందానగర్, జనవరి 25: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని చందానగర్ ప్రగతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర అన్నారు. శనివారం చందానగర్‌లో కళాశాల విద్యార్థుల స్పోర్ట్స్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఖోఖో, కబడ్డీ, రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, త్రోబాల్, వాలీబాల్‌తో పాటు పలు పోటీలు జరిగాయి. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రిన్సిపాల్ అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె వేయాలి

ఖేల్‌కాలనీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాకపోకలతో రద్దీగా ఉండే రామాలయం గేటు ఎదుట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. ప్రధాన గేటు ఎదుటే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో భక్తులు ఆందోళనకు గురవుతున్నారు. నిత్యం ఉత్సవాలు, వేడుకలు జరిగే రామాలయానికి ప్రతీరోజు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. కాగా ఇదే ప్రాంగణంలో చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె వేసి ప్రమాదాలను అరికట్టాలని భక్తులు, కాలనీవాసులు కోరుతున్నారు.


ఎంఐజీ రామాలయం ఎదుట ట్రాన్స్‌ఫార్మర్

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

గచ్చిబౌలి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జాయింట్ కమిషనర్ ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు, ఇన్‌చార్జీలు సుమారు 200 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జోనల్ కార్యాలయం ముందు 'భారతదేశ పౌరులమైన మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో నిష్పక్షపాతంగా ఎన్నికల వాతావరణం నిలబడెతామని, మత, భాష, వర్గం, ఒత్తిడిలకు ప్రభావితం కాకుండా ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జోనల్ కార్యాలయం నుంచి పాత ముంబై రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. 19 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, నిర్భయంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆరునెలలుగా ప్రత్యేక ఓటరు లిస్టు తయారీ, ఓటరు నమోదు, దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించిన బీఎల్ఓలకు వెస్ట్‌జోన్, చందానగర్, కూకట్‌పల్లికి చెందిన ఐదుగురికి (శేరిలింగంపల్లి సర్కిల్ షాజహాన్, వెంకటయ్య, కూకట్‌పల్లికి చెందిన అరుణకుమారి, చందానగర్ సర్కిల్ రాజు, అనిత) బూత్‌లెవల్ ఆఫీసర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు.


జాతీయ ఓటరు దినోత్సవంలో పాల్గొన్న వెస్ట్‌జోన్ జాయింట్ కమిషనర్ ముకుందరెడ్డి, అధికారులు



కొండాపూర్‌లో విద్యార్థులు, ఫ్రెండ్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

కొండాపూర్‌లో ర్యాలీ..

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండాపూర్ సఫారినగర్‌లోని న్యూబ్లూమ్ హైస్కూల్, శేరిలింగపల్లి ఫ్రెండ్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పూలపల్లి వెంకటరమణ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. భారత ఎన్నికల కమిషన్ జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవంగా 2011లో ప్రకటించిందన్నారు. నాటి నుంచి ప్రతి ఏడాది ఓటరు దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న హక్కుల్లో ముఖ్యమైనది ఓటు హక్కు అన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, ఫ్రెండ్స్‌వెల్ఫేర్ సభ్యులు పాల్గొన్నారు.


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, అంతయ్యగౌడ్

ముగిసిన శ్రీచిత్తారమ్మదేవి జాతర

షాపూర్‌నగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వారం రోజులపాటు వైభవంగా జరిగిన గాజులరామారం శ్రీచిత్తారమ్మదేవి స్వర్ణోత్సవ జాతర శనివారం అన్నదాన కార్యక్రమంతో ముగిసిందని ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు అన్నదాన కార్యక్రమాన్ని కంటెస్టెంట్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదిరోజులపాటు జరిగిన అమ్మవారి జాతరకు సహకరించిన భక్తులు, ఆలయ కమిటీ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అంతయ్య గౌడ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం జరిగిన అమ్మవారి జాతరను ప్రత్యేకంగా నిర్వహించడం జరిగిందన్నారు. అన్నదాన కార్యక్రమానికి విశేషస్పందన వచ్చిందని, సుమారు 15వేలమంది భక్తులు పాల్గొన్నట్లు తెలియజేశారు. అన్నదాన కార్యక్రమంతో జాతర ముగిసిందని తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్. బాలేరాజ్, డైరెక్టర్లు, ముఖ్యసలహాదారులు, భక్తులు పాల్గొన్నారు.


ఈటల రాజేందర్‌ను సత్కరిస్తున్న 130వ డివిజన్ అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి

కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఈటల రాజేందర్

జీడిమెట్ల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా అందరినీ కలుపుకుని ముందుకు సాగాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ నూతన అధ్యక్షునిగా నియమితులైన శాంపూర్ విజేందర్‌రెడ్డి శనివారం ఎంపీ ఈటల రాజేందర్‌ను, జిల్లా ఇంచార్జీ ఎస్.మల్లారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు ఎం.ఎస్.వాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సత్తిబాబు పాల్గొన్నారు.


దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన రాజీవ్‌గృహకల్ప వాసులు

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం

నిజాంపేట్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్పలోని శ్రీశ్రీశ్రీ ఉమామహేశ్వరి, నల్లపోచమ్మ దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కాలనీవాసులు కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డిని కలిసి విన్నవించుకున్నారు. అందుకు సానుకూలంగా స్పందించిన శ్రీనివాస్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలందిస్తానని హామీ ఇచ్చారు. శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన వారిలో పితాని శ్రీనివాసరావు, బాలకృష్ణ, లక్ష్మణ్, రామచంద్రనాయక్, ఎం శ్రీనివాసరావు, ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.


ఇంజనీరింగ్ అధికారులతో చర్చిస్తున్న బీజేపీ నాయకులు శేఖర్‌యాదవ్

లింకు రోడ్ల ఏర్పాటుకు సర్వే

జీడిమెట్ల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గాజులరామారం సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు, బీజేపీ రాష్ట్ర నాయకులు జేకే.శేఖర్‌యాదవ్ విన్నపాన్ని మన్నించి జగద్గిరిగుట్టలో లింకురోడ్ల నిర్మాణానికి సర్వే నిర్వహించారు. డీసీ మల్లారెడ్డి ఆదేశాల మేరకు డీఈ రూపాదేవి మగ్దూంనగర్ సబ్‌స్టేషన్ నుంచి హెచ్ఎండీఏ ల్యాండ్, బీరప్పనగర్, దేవమ్మ బస్తీ, గాంధీనగర్, వెంకట్రామిరెడ్డినగర్ వరకు లింకు రోడ్లు వేయడానికి సన్నాహాలు మొదలుపెట్టారు. అదేవిధంగా జగద్గిరినగర్ కమ్యూనిటీ హాల్‌పై రెండు అదనపు ఫ్లోర్లు వేయాలని కోరడంతో సానుకూలంగా స్పందించి అంచనాలు తయారు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గండి రాజుయాదవ్, సత్యనారాయణయాదవ్, పాండు, గోవర్ధన్, ముత్యాలు పాల్గొన్నారు.


మల్లు రవిని తన నివాసంలో కలిసిన శ్రీశైలంగౌడ్

ఎంపీని కలిసిన హెచ్ఎంటీ ఎంప్లాయిస్

షాపూర్‌నగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): హెచ్ఎంటీ కంపెనీ మెషిన్ టూల్స్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌లు నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవిని ఆయన నివాసంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పరిశ్రమలో సమస్యలపై చర్చించారు. సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి, కేశవ్, శ్రీహరి, లక్ష్మణ్, జీ.కుమార్, రాంబాబు తదితరులు ఉన్నారు.

సుచిత్రా అకాడమీలో బిస్కో 2025


విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న కళాకారిణి దీపానాత్

పేట్‌బషీరాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని సుచిత్రా అకాడమీలో విజువల్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ప్రదర్శన బిస్కో 2025ను శనివారం నిర్వహించారు. విద్యార్థులు అద్భుతమైన శిల్పాలు, కుండల నుంచి క్లిష్టమైన సిరామిక్ ముక్కలు, సున్నితమైన చేతి పనులు, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్‌లు మొదలైన 250కి పైగా కళాత్మక చిత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కళాకారిని దీపానాత్ హాజరై విద్యార్థులు ప్రదర్శించిన నైపుణ్యాలను తిలకించి, వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సుచిత్రా అకాడమీ ప్రిన్సిపల్ దీపాకపూర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌తో కలిసి బౌరంపేటలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి


నిజాంపేట్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మేయర్ కొలన్ నీలారెడ్డిలు

మున్సిపాలిటీల అభివృద్ధే ధ్యేయం

- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- రూ.2.79 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

దుండిగల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ధ్యేయంగా మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం దుండిగల్, నిజాంపేట్ కార్పొరేషన్లలో పలు అభివృద్ధి పనులకు స్థానిక చైర్‌పర్సన్, మేయర్‌తో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలు వెచ్చించి దుండిగల్ మున్సిపాలిటీని మౌలిక వసతుల కల్పనతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని, రానున్న రోజుల్లో కూడా మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ అభివృద్ధి పనులు.. బౌరంపేట 18వ వార్డులో భ్రమరాంబిక మల్లిఖార్జున ఆలయం వద్ద రూ.90 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులు, కమాన్ నుంచి బొడ్రాయి వరకు ఒక కోటి 10 లక్షలతో వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అదేవిధంగా గ్రామ బస్టాప్ నుంచి బొడ్రాయి వరకు మరో రూ.45 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రారంభోత్సవంలో దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి, వైస్ చైర్మన్ పద్మారావు, ఫ్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, బెంబడి వనిత, నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాచారం సునీత, సింగిల్ విండో డైరెక్టర్లు భీమ్‌రెడ్డి, సత్తిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

నిజాంపేట్ కార్పొరేషన్‌లో

నిజాంపేట్ గ్రామ పంచాయితీ స్థాయి నుంచి కార్పొరేషన్ స్థాయి వరకు అతి కొద్దికాలంలోనే ఎంతో అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. మాజీమంత్రి కేటీఆర్ ప్రత్యేక దృష్టితో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మోడ్రన్ కార్పొరేషన్‌గా అభివృద్ధి పరిచామని తెలిపారు.

అభివృద్ధి పనులు ఇవే

13వ వార్డు బాలాజీ వెస్ట్ కాలనీలో రూ25 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులు, 7వ వార్డులో అక్షతి అపార్టు మెంట్ వద్ద రూ.25 లక్షలతో సీసీ రోడ్డు పనులు, 11వ వార్డు కేటీఆర్ కాలనీలో రూ.25 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు, 30వ వార్డులోని జయదీపిక మెయిన్ లైన్ల వద్ద రూ.60 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులు, బెవర్లీ పార్క్స్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు, జర్నలిస్టు కాలనీ చెర్ల యల్లమ్మ దేవాలయం వద్ద రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు, శివాజీనగర్‌లో రూ. 25.50 లక్షలతో భూగర్భ డ్రైనేజీతో పాటు సీసీ రోడ్డు పనులు, 28వ వార్డులో రాజిరెడ్డి హైట్స్ నుంచి హెచ్ఎండబ్ల్యూఎస్ వాటర్‌ట్యాంక్ వరకు రూ.99 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ కొలన్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్లు ప్రణయ్, రవికిరణ్, కొలన్ మీన, రాఘవేంద్రరావు, బొర్రా దేవి, గాజుల సుజాత, ఆవుల పావని, చిట్ల దివాకర్, కో-ఆప్షన్ సభ్యులు అభిషేక్‌రెడ్డి, సయ్యద్ సలీమ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయప్రసాద్, మహిళా అధ్యక్షురాలు అర్పిత, నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, జగన్‌యాదవ్, సాంబశివారెడ్డి, మధుసూధన్, ప్రవీణ్‌లతో పాటు వందలాది మంది పలు కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

గ్రామ సభల్లో అర్హులకు అన్యాయం

- భవనాలు ఉన్న వారికే ఇళ్లు

నిజాంపేట్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేద ప్రజలకు ప్రజాపాలన సభలో అన్యాయం జరుగుతోందని, సభలు అనేక అవకతవకలతో కొనసాగుతున్నాయని బాచుపల్లి సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో పేదలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్‌లోని 1వ డివిజన్ నుంచి 33వ డివిజన్ల వరకు ప్రతీ డివిజన్‌లో సొంత భవనాలున్న వారి పేర్లనే అధికారులు ప్రజాపాలనలో ప్రకటించారని ఆరోపించారు. కేవలం 10 శాతం పేద ప్రజలకే నిజాంపేట్‌లో ఇల్లులేని వారికి లిస్టులో పేర్లు వచ్చాయన్నారు. పేద ప్రజలు చేసుకున్న దరఖాస్తులను ఏ చెత్త డబ్బాలో వేశారని శ్రీనివాస్ ప్రశ్నించారు.


సీపీఐ నాయకులు పాలబిందెల శ్రీనివాస్

కార్పొరేటర్లకు అనుచరులుగా ఉన్న కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులకు సంబంధించిన పేర్లు చదివారని, దీంతో ప్రజలు అయోమయానికి గురయ్యారని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కార్పొరేషన్ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి అర్హులైన వారినే గుర్తించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



సందల్ ముబారక్ కార్యక్రమం

గాజులరామారం డివిజన్ వీపీనగర్‌లో నిర్వహించిన సందల్ ముబారక్ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి, ముస్లిం సోదరులు, కాశీ, రషీద్‌బేగ్, లాల్‌మహ్మద్, రషీద్‌వర్గులు.

- గాజులరామారం (ఆంధ్రజ్యోతి)


విజేతలను అభినందిస్తున్న డీసీపీ

గేమ్స్ అండ్ స్పోర్ట్స్ డ్యూటీ మీట్‌లో విజేతలను అభినందించిన డీసీపీ

జీడిమెట్ల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మూడు రోజుల పాటు నిర్వహించిన గేమ్స్ అండ్ స్పోర్ట్స్ డ్యూటీ మీట్‌లో విజేతలుగా నిలిచిన బాలానగర్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బందిని డీసీపీ కె.సురేష్‌కుమార్ అభినందించారు. విజేతలకు వివిధ మెడల్స్ అందించి డీసీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ హన్మంతురావు, జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్, ఎస్.ఐ ప్రేమ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


అఖిల్ (ఫైల్)

రాంనగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లకుంట పీఎస్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లకుంట బాయమ్మగల్లీలో నివాసం ఉంటున్న వి.విజయ్, స్వరూపల పెద్ద కుమారుడు అఖిల్ నారాయణగూడలోని ఆకాష్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల కుటుంబ సభ్యులు తిరుపతి వెళ్లారు. వారు తిరుపతిలో ఉండగానే అఖిల్ కళాశాలకు రాలేదని, అతడి పుస్తకాలు కాలేజీలోనే ఉన్నాయని వచ్చి తీసుకెళ్లాలని సమాచారం అందించారు. శనివారం 12 గంటల సమయంలో తల్లిదండ్రులు కాలేజీకి వెళ్లగానే ఇంట్లో ఉన్న అఖిల్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు కాలేజీ నుంచి వచ్చి చూసేసరికి ఉరి వేసుకుని అఖిల్ కనిపించాడు. వెంటనే కిందకు దించి ఆస్పత్రికి తీసుకెళ్లేసరికి అప్పటికే చనిపోయాడని వైద్యులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


పాలకమండలి సభ్యులతో ఎమ్మెల్యే వివేకానంద్

పదవి ఉన్నా లేకపోయినా ప్రజల కోసం పనిచేయాలి: ఎమ్మెల్యే

పేట్‌బషీరాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజల కోసం పనిచేసే నాయకులకు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కొంపల్లి పురపాలక సంఘం పాలకవర్గ పదవీ కాలం ముగుస్తున్న సందర్భంగా మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో సభ్యులకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కొంపల్లి మొదటి కౌన్సిల్ 2020న ఏర్పడిందని నేటికి ఐదు సంవత్సరాలు పూర్తి అవుతుందన్నారు. చైర్‌పర్సన్ సన్నా శ్రీశైలంయాదవ్ మాట్లాడుతూ పాలకవర్గం ఏకతాటిపై నిలబడి పట్టణంలో ఉన్న 18 వార్డుల్లో అభివృద్ధి చేపట్టారన్నారు. అనంతరం కౌన్సిల్ సభ్యులను శాలువాలతో ఎమ్మెల్యే సన్మానించారు. పాలకమండలి సహకారంతో పురపాలక సంఘాన్ని ఎంతో అభివృద్ధి పరిచామని చైర్‌పర్సన్ శ్రీశైలంయాదవ్ అన్నారు. అంతకుముందు పురపాలక సంఘం పరిధిలోని వార్డుల్లో 2.79కోట్లతో చేపట్టనున్న బీటీరోడ్లు, సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీ, వర్షపునీరు నాలా నిర్మాణ పనులకు పాలకమండలి సభ్యులతో కలసి ఎమ్మెల్యే వివేకానంద్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, వైస్‌చైర్మన్ గంగయ్య నాయక్, మాజీ ఎంపీపీ సన్నా కవిత శ్రీశైలంయాదవ్, కౌన్సిలర్లు రవియాదవ్, రవీందర్ యాదవ్, మంజుల, సువర్ణ, వసంత, కృష్ణవేణి వినోద్, శిరిషా ప్రవీణ్, డప్పు కిరణ్, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

విద్యార్థులతో ర్యాలీ

కుత్బుల్లాపూర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓటరు దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని ఐడీపీఎల్ నుంచి సర్కిల్ కార్యాలయం వరకు విద్యార్థులతో జీహెచ్ఎంసీ అధికారులు ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీలు మల్లారెడ్డి, నర్సింహులు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు.


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

క్రీడాకారులకు మెమెంటోలు అందజేత

గాజులరామారం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): నిర్మల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అంతర్ జిల్లా ప్రభుత్వ పాఠశాలల ఆటల పోటీలు గాజులరామారం ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఫైనల్స్‌ను నిర్వహించారు. ఈ పోటీలకు ఆదిలాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు వాలీబాల్, క్యారమ్, బ్యాడ్మింటన్, చెస్, కోకో పోటీల్లో క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్ క్రీడల్లో గాజులరామారం క్రీడాకారులు, కోకో ఆటలో జీడిమెట్ల పాఠశాల క్రీడాకారులు మొదటిస్థానంలో నిలిచారు. నిర్వాహకులు వారికి మెమెంటోలను అందజేశారు.

ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వ్యక్తులపైకి దూసుకెళ్లిన కారు

- హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఘటన


ప్రమాదానికి కారణమైన కారు

బంజారాహిల్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): యువకుల నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ఫుట్‌పాత్‌పైకి కారు దూసుకుపోవడంతో అక్కడ నిద్రిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. నిందితులు కారును అక్కడే వదిలేసి పారిపోయారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఈ దారుణం జరిగింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన నగల వ్యాపారి కుమారుడు హర్షవర్ధన్ షార్ట్ ఫిలింలు తీస్తూ హైదరాబాద్‌లో స్నేహితులతో కలిసి ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అతని స్నేహితుడు రాకేశ్ జూబ్లీహిల్స్‌లోని ఓ పబ్‌లో మద్యం తాగి తనను గదికి తీసుకెళ్లాలని హర్షవర్ధన్‌కు ఫోన్ చేశాడు. హర్షవర్ధన్ కూడా మద్యం తాగి ఉండటంతో తన కారును ఇతర స్నేహితులైన సాంకేత్ శ్రీనివాస్, వంశీకి ఇచ్చి పంపాడు. వారు జూబ్లీహిల్స్‌లో రాకేశ్‌ను ఎక్కించుకుని తిరిగి వెళుతుండగా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సమీపంలో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌పైకి దూసుకుపోయి.. రెయిలింగ్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. దాంతో అక్కడ నిద్రిస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి(40) అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కారు నడుపుతున్న శ్రీనివాస్, అతని పక్కనే ఉన్న వంశీ పారిపోయారు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.


విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేస్తున్న సతీష్ సాగర్

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ అందజేత

పేట్‌బషీరాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ఆదుకొనేందుకు ముందుంటానని సంకల్ప ఫౌండేషన్ సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పెద్దబుద్దుల సతీష్‌సాగర్ అన్నారు. శనివారం కొంపల్లి మున్సిపాలిటీలోని మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేశారు. గతంలో మున్సిపాలిటీ పరిధిలోని దూలపల్లి, కొంపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బూట్లు, స్కూల్ బ్యాగ్‌లు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. ఉపాధ్యాయులు స్పోర్ట్స్ దుస్తులు విద్యార్థులకు కావాలని కోరడంతో 140మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు మధు, మహేందర్, తిరుపతి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లూ ఇవ్వకుండా.. కమిటీ కదిలేదెట్లా!

కీలక అధికారులు సహకరించడం లేదని ఆరోపణలు


జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరీక్షల విభాగంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విచారణ మూడు అడుగులు ముందుకు, ఆరడుగులు వెనక్కు అన్నట్లుగా జరుగుతోంది. తొలుత విచారణ కమిటీకి చైర్మన్‌ను నియమించకుండా కేవలం సభ్యులను మాత్రమే నియమించిన ఉన్నతాధికారులు, తాజాగా విచారణను ముందుకు కొనసాగించేందుకు సహకరించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమిటీలో కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్లను ఒకరిద్దరిని చేర్చమని నియమించమని సభ్యులు కోరినా ససేమిరా కుదరదన్నట్లు సమాచారం. విచారణను మొదలెట్టేందుకు అవసరమైన క్లూ గానీ, ఫిర్యాదు పత్రాల కాపీలను ఇమ్మని కమిటీ అడిగినా సుముఖత వ్యక్తం చేయలేదని సమాచారం. విచారణ పేరుతో కేవలం కమిటీని వేసి చేతులు దులుపుకున్న ఉన్నతాధికారులు తమకు సహకరించకుంటే, విచారణను ఇకపై ముందుకు కొనసాగించలేమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై వర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌తో భేటీ అయ్యేందుకు అపాయింట్‌మెంట్ కోరగా, ఆయన రెండ్రోజులుగా అందుబాట్లో లేరనే జవాబు వచ్చినట్లు తెలిసింది. ఆది లేదా సోమవారాల్లో అయినా ఒకసారి వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీతో భేటీ కావాలని కమిటీ సభ్యులు భావిస్తున్నారు. పరీక్షల విభాగంలో విచారణ అంతా టెక్నికల్ అంశాలతో ముడిపడి ఉన్నందున కంప్యూటర్ సైన్స్ నిపుణులను ఇవ్వాలని, ఫిర్యాదుకు పత్రాల నకలు కాపీలను అందజేయాలని నేరుగా వీసీని డిమాండ్ చేసేందుకు సభ్యులు సన్నద్ధమయ్యారు. మరోవైపు కమిటీ విచారణ ముందుకు సాగకుండా అడ్డుపడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, ప్రొఫెసర్ల కమిటీతో కానప్పుడు పోలీసు ఎంక్వయిరీకి కేసును బదిలీ చేయాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఇన్‌చార్జ్ వీసీకి విజ్ఞప్తి చేస్తున్నారు.